ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 16 ఏప్రిల్ 2024

పలాసలో రాత్రి బస..

ప్రజాగళం సభ అనంతరం చంద్రబాబునాయుడు సోమవారం రాత్రి పలాసలోనే బస చేశారు. మంగళవారం ఉదయం జిల్లాలోని ఇతర నియోజక వర్గాలకు సంబంధించిన టీడీపీ అభ్యర్థులతో సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం. అలాగే ఇటీవల టికెట్ దక్కనివారిని పిలిపించుకుని వారితో మాట్లాడనున్నట్టు తెలిసింది.



పలాస సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, భారీగా హాజరైన ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

అక్కడ పెద్ద.. ఇక్కడ చిన్న సైకో

- ఇద్దరూ కొండలకు గుండుకొట్టారు!
- సీఎం జగన్, మంత్రి సీదిరి అప్పలరాజు తీరుపై టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజం
- అధికారంలోకి రాగానే అక్రమాలపై విచారణ చేస్తామని స్పష్టం
- ఉద్యానవనానికి పూర్వవైభవం తీసుకువస్తామని భరోసా

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

"అక్కడ పెద్ద సైకో సీఎం జగన్ రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. విశాఖలో రుషికొండను బోడికొండగా మార్చేశారు. ఇక్కడ(పలాసలో) చిన్న సైకో మంత్రి సీదిరి అప్పలరాజు నెమలికొండ, సూదికొండ, నల్లబొడ్లూరు కొండలకు గుండుకొట్టారు" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. పలాసలో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, వైసీపీ నేతల తీరుపై ధ్వజమెత్తారు. కొద్దిరోజులే వైసీపీకి అధికారం ఉందని అందుకే జగన్ కొత్త డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. పలాస నియోజకవర్గంలో కొండలను సైతం వైసీపీ నేతలు ఆక్రమించడంతో గ్రామాల్లోకి ఎలుగుబంట్లు వచ్చేస్తున్నాయని పేర్కొన్నారు. మే నెలలో చెరువులో చేప ఎగిరిపోతుందని మంత్రి సీదిరిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసింది. జనసైనికులు, బీజేపీ కార్యకర్తలు, టీడీపీ సైన్యం వైసీపీని తరిమేందుకు సిద్ధంగా ఉన్నారు. మా మూడు పార్టీల అజెండా ఒక్కటేనని.. ప్రజాసంక్షేమమే ధ్యేయం. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించి.. వైసీపీని సాగనంపాల'ని పిలుపునిచ్చారు. వైసీపీ విధ్వంసకర పాలనపై ధ్వజమెత్తుతూ.. తాము అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధిని వివరించారు.

- 'ఎన్డీఏ ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్‌నాయుడు, పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా శిరీష పోటీ చేస్తున్నారు. వారిని ఆశీర్వదించి గెలిపించాలి. ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ దివంగత నేత ఎర్రన్నాయుడు లేని లోటు రామ్మోహన్‌నాయుడు తీర్చుతున్నాడు. రెండుసార్లు ఎంపీగా గెలిచి తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచాడు. ఈ ప్రాంతంలో గుర్తొచ్చే మరో పేరు.. సర్దార్ గౌతు లచ్చన్న.. రాజకీయ ప్రాధాన్యత ఉన్న, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. ఆ కుటుంబ సభ్యులు నేడు ఎన్నో అవమానాలకు గురవుతున్నారు. ఒక్క సారి ఎమ్మెల్యే అయితే ఇంతలా తోకజాడిస్తే.. మూడు తరాలుగా రాజకీయాలు చేస్తున్న గౌతు కుటుంబానికి ఎంత ఉండాలి. అచ్చెన్నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేశారు. గౌతు శిరీషకు ఇబ్బందులకు గురిచేశారు. టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులపై కేసులు పెడుతున్నారు. నేను అలాగే అనుకుంటే వీరంతా పాదయాత్రలు చేసేవారా తమ్ముళ్లు. పవన్ కల్యాణ్‌కు తీవ్రంగా అవమానించారు. ఎన్నిరకాలుగా అవమానించినా ఈ రాష్ట్రంలో వైసీపీని గద్దెదింపే వరకు మా పోరాటం ఆగదు. వైసీపీని సాగనంపడమే లక్ష్యంగా ఎన్డీఏతో కలసి పోరాడుతున్నాం.
- 'కిడ్నీ సమస్య కోసం డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఫించన్లు అందజేశాం. కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను మంజూరు చేశాం. మత్స్యకారులను ఆదుకున్నాం. హుద్‌హుద్ సమయంలో విశాఖప ట్నాన్ని, తితలీ తుఫాన్ సమయంలో పలాస ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించి ప్రాణనష్టం జరగకుండా కాపాడాను. అదే సమయంలో పక్కనే విజయనగరంలోనే ఉన్న ఈ సైకో జగన్ కనీసం మిమ్మల్ని పరామర్శించడానికి వచ్చాడా.. మీకు కష్టం వచ్చినపుడు అండగా నిలిచిన నాయకులు మీకు కావాలా.. ఇలాంటి సైకోలు కావాలా?' అని చంద్రబాబు ప్రశ్నించారు.
- కష్టపడి చదువుతూ ఉత్తరాంధ్ర యువత ముందుంటారు. డిఫెన్స్‌లో పనిచేసే వారు ఎక్కువగా శ్రీకాకుళం జిల్లా వారే. ఇందుకు అభినందిస్తున్నాను. విశాఖ నుంచి భావనపాడుకు బీచ్ రోడ్డు ఏర్పాటు చేస్తే.. పరిశ్రమలు పెరిగి వలసలు నిలిచిపోతాయి. ఉపాధిమార్గాలు పెరుగుతాయి. ఎర్రన్న, గౌతు లచ్చన్న స్ఫూర్తిగా ప్రజాసేవలో ముందు కెళ్దామని పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపునిచ్చారు.



చంద్రబాబు సభలో పోలీసు బందోబస్తు

ప్రజాగళం... ప్రభంజనం



చంద్రబాబుతో ఎంపీ రామ్మోహన్, గౌతు శిరీష

- పలాసలో చంద్రబాబుకు ఘన స్వాగతం
- రోడ్‌షోకు పోటెత్తిన అభిమానులు, ప్రజలు

(శ్రీకాకుళం/పలాస)

పలాస.. పసుపుమయమైంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సోమవారం రాత్రి పలాసలో నిర్వహించిన ప్రజాగళం సభ.. ప్రభంజనంగా మారింది. భారీ సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. చంద్రబాబుకు నీరాజనం పలికారు. 'జై తెలుగుదేశం.. జైజై తెలుగుదేశం'.. 'సీఎం.. సీఎం..' అంటూ నినాదాలు చేశారు. ఆ ఉత్సాహంతో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, సీఎం జగన్, మంత్రి సీదిరి అప్పలరాజు, ఆ పార్టీ నేతల రాజకీయ డ్రామాలను తూర్పార బడుతూ.. చంద్రబాబు ధ్వజమెత్తారు. చంద్రబాబు గంటన్నరపాటు ఉషారుగా ప్రసంగించగా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. చప్పట్లతో హోరెత్తించారు. తాను ఎన్నోమార్లు ఈ ప్రాంతానికి వచ్చినా.. ఎన్నికల ముందు ఇంత జనాన్ని తాను చూడలేదని.. జనాన్ని చూసి.. వారి స్పందన చూసి చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బి అయిపోయారు. 2019 ఎన్నికల్లో టీడీపీని వీడిన వారు.. మళ్లీ చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిపోయారు. ఇదిలా ఉండగా ముందస్తు చర్యగా డ్రోన్ కెమెరాలు, ప్రత్యేక పోలీసులను అడుగడుగునా పహారా పెట్టారు. వాహన రద్దీలను అడ్డుకోవడానికి పోలీసులు సైకిళ్లను బారికేడ్లుగా పెట్టడంపై చర్చించుకున్నారు.

- చంద్రబాబు సభకు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల నుంచి వేలాది మంది ప్రజలు, మహిళలు సైతం తరలివచ్చారు. కాగా నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో ఎలుగుబంట్లు సంచారం భయంతో కొంతమంది మహిళలు ముందుగానే ఇళ్లకు వెళ్లిపోయారు. ఏది ఏమైనప్పటికీ పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో మంత్రి సీదిరి అప్పలరాజుపై ఎంతటి వ్యతిరేకత ఉందో సభ ద్వారా మరోసారి స్పష్టమైంది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు గౌతు శిరీష, గొండు శంకర్, మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే ఇవన్నీ చేస్తాం..

- 'ఉద్యానవనానికి పూర్వవైభవం తీసుకువస్తా. ఉద్దానం రూపురేఖలు మారుస్తా.
- మహేంద్ర తనయా, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేస్తాం.
- వంశధార- బహుదా అనుసంధానం
- వంశధార నీరు ఇచ్ఛాపురం వరకూ సరఫరా
- కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం
- పలాసలో రైతు బజారు ఏర్పాటు
- ప్రతి ఇంటికీ శుద్ధజలం సరఫరా
- వంశధార కాలువలకు సిమెంటు లైనింగ్
- జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు, డిఫెన్స్ అకాడమి, ఐఎస్ఐ ఆసుపత్రి, స్కిల్ డెవలప్ మెంటు సెంటర్ ఏర్పాటు చేస్తాం. యువతకు అత్యున్నత ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తాం.
- జీడి పప్పుకోసం ఒక బోర్డు ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటాం. మద్దతు ధర అందజేస్తాం. ఆడబిడ్డలకు ఇళ్లు నిర్మించి అందజేస్తాం. ఇళ్లలేని వారికి రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మిస్తాం. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి అందజేస్తాం. రూ.4వేలు చొప్పున పింఛను అందజేస్తాం. సంపద సృష్టించి ఆడబిడ్డలకు లక్షాధికారులను చేస్తాను. బీసీలకు 50ఏళ్లకే పింఛను అందజేస్తాం. ఆదరణకు రూ.5వేలు కోట్లతో ఆదుకుంటాం. భూ పరిరక్షణ చట్టం రద్దుచేసి ప్రజలకు ఆదుకుంటాం.
- కిడ్నీ రోగాలకు కారణాలపై పరిశోధనలు చేస్తాం. ఇక్కడ ప్రజలు తినే ఆహారంపైనా పరిశోధనలు చేసి కిడ్నీ రోగాలే ప్రబలకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామ'ని చంద్రబాబు భరోసా ఇచ్చారు.



అభిమానులు, పార్టీ శ్రేణుల సందడి

వైసీపీకి భారీ షాక్

- ఎమ్మెల్సీ దువ్వాడ సోదరుడు రాజీనామా.. టీడీపీలో చేరిక
- శ్రీకాంత్ సతీమణి కూడా..

పలాస, ఏప్రిల్ 15: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సోదరుడు శ్రీకాంత్, ఆయన సతీ మణి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జయశ్రీ వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీడీపీలో చేరారు. సోమవారం ఉదయం పలాసలో వారి స్వగృహంలో విలేకరులతో దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. తాము ఎందుకు పార్టీకి రాజీనామా చేయాల్సి వచ్చిందో వివరించారు. కాంగ్రెస్‌కు జగన్మోహన్‌రెడ్డి రాజీనామా చేసిన వెంటనే తాను మొదటిసారిగా జిల్లా నుంచి ఆయనకు మద్దతు పలికానని గుర్తుచేశా రు. 'గ్రామస్థాయి నుంచి పట్టణం వరకూ మంత్రి అప్పలరాజుకు పరిచయం చేసిన వ్యక్తిని నేను. నన్ను మూడేళ్లుగా తొక్కే ప్రయత్నం చేశారు. పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ ఒక్క కార్యక్రమానికి కూడా ఆహ్వానించ లేదు. నా ఆవేదనను అర్థం చేసుకుని జిల్లా నాయకులు నాకు పూర్తి మద్దతు పలికారు. నా భార్య జయశ్రీకి 2020లో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని తమ్మినేని సీతారామ్ ఇప్పించారు. ఆయనకు కృతజ్ఞతలు. అయితే ఒక్క సమావేశానికి కూడా ఆహ్వానం అందలేదు. మా దంపతులకు జరిగిన అన్యాయానికి నిరసనగా పార్టీకి, పదవులకు రాజీనామా చేస్తున్నామ'ని దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం సాయంత్రం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. సీనియర్ నాయకుడైన దువ్వాడ శ్రీకాంత్ రాజీనామా ఎన్నికల్లో వైసీపీ ఓటు బ్యాంక్‌పై ప్రభావం చూపించే అవకాశం ఉంది.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన దువ్వాడ శ్రీకాంత్, జయశ్రీ

రాజీనామా చేయకుంటే
పథకాలు నిలిపేస్తాం

- వలంటీర్లకు వైసీపీ నేతల బెదిరింపులు

మెళియాపుట్టి, ఏప్రిల్ 15: ఎన్నికల వేళ వైసీపీ నేతలు వలంటీ ర్లకు ఓ వైపు ఆఫర్ ఇస్తూనే.. మరోవైపు బెదిరింపులకు పాల్పడుతు న్నారు. 'మీరు మర్యాదగా రాజీనామా చేస్తే రెండు నెలల జీతం ముందే ఇస్తాం. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే మిమ్మల్నే వలంటీర్లుగా కొనసాగిస్తాం. రాజీనామా చేయని వలంటీర్ల కుటుంబాలకు సంక్షేమ పథకాలు నిలిపేస్తాం' అని మెళియాపుట్టిలో స్థానిక వైసీపీ నాయకులు వలంటీర్లకు స్పష్టం చేశారు. దీంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 303మంది వలంటీర్లు ఉండగా ఇప్పటి వరకు కేవలం 55మంది మాత్రమే రాజీనామా చేశారు. వైసీపీ నాయకులు బెదిరించి మరీ రాజీనామా చేసేలా వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం వరకు 8మంది రాజీనామా చేయగా.. సోమవారం ఒక్కరోజే స్థానిక ప్రజాప్రతినిధి దగ్గరుండి మరీ 47మంది రాజీనామా చేయించడం చర్చనీయాంశమైంది.

గురుకులాల్లో మిగులు సీట్లకు కౌన్సిలింగ్

గుజరాతీపేట, ఏప్రిల్ 15: గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల కోసం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆ విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో చేరేందుకు ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థులకు మొదటి లిస్టులో కేటాయించిన విషయం తెలిసిందే. మిగులు సీట్లకు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థుల మెరిట్ లిస్టు ప్రకారం ఈ నెల 18న దుప్పల వలస గురుకుల పాఠశాల(బాలురు), 19న పెద్దపాడు గురుకుల పాఠశాలలో ఉదయం పది గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. మెరిట్‌లో ఉన్న విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ఏమైందో..?

- ముంబైలో వలస కూలీ అనుమానాస్పద మృతి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15: ఇచ్ఛాపురం మండలం కేదారిపురానికి చెందిన వలస కూలీ నీలాపు గణేష్ (27) ముంబైకి 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎగత్‌పూర్‌లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాధారణ రైతు కుటుంబానికి చెందిన నీలాపు కామరాజు, తరిణమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు దుర్యోధన సేఫ్టీ ఇంజనీర్‌గా ఢిల్లీలో పనిచేస్తున్నాడు. కూతురు లావణ్య ఇంటి వద్దనే ఉంది. రెండో కుమారుడు గణేష్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 16న ఉపాధి కోసం దుబాయ్ వెళ్తానని ఇంట్లో చెప్పి.. ముంబై వెళ్లాడు. దుబాయి వెళ్లేందుకు వీసా రాకపోవడంతో ముంబై సమీపంలోని ఎగత్‌పూర్‌లో ఉంటున్నాడు. ఆదివారం ముంబై జీఆర్పీ పోలీసుల నుంచి గణేష్ కుటుంబ సభ్యులకు ఫోన్ వచ్చింది. ఏమైందో తెలియదు కానీ.. గణేష్ శనివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు విలపిస్తూ ముంబై పయనమయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



గణేష్ (ఫైల్)

రూ.90 వేల నగదు సీజ్

సంతబొమ్మాళి, ఏప్రిల్ 15: శ్రీకృష్ణాపురం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోమవారం వాహన తనిఖీలు చేశారు. బోరుభద్రకు చెందిన గుడ్ల ప్రసాద్ వద్ద నుంచి రూ.90వేల నగదును సోమవారం సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఏఎస్ఐ మెట్ట విజయ్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో ఏఆర్ ఎస్ఐ జనార్దన, రావాడ ఆదినారాయ ణ, సిబ్బంది మధు పాల్గొన్నారు.

పలాసలో పులి దిగింది జాగ్రత్త

● పలాసలో ఐదేళ్లలో కొరవడిన ప్రశాంతత ● త్రిమూర్తులతో రాష్ట్రాభివృద్ధికి బాటలు ● పలాసకు కేంద్రీయ విద్యాలయం తీసుకువస్తా ● ఎంపీ రామ్మోహన్‌నాయుడు

పలాస/పలాసరూరల్/మందస/వజ్రపుకొత్తూరు/హరిపురం: పలాసలో పౌరుషం చూస్తున్నానని, పలాస ఉగ్రరూపం ధాటికి తట్టుకునే శక్తి ఆ దొంగల రాజుకు లేదని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పలాసలో సోమవారం ప్రజాగళం బహిరంగసభలో ఎంపీ మాట్లాడుతూ.. ప్రజాగళంలో పెద్దపులిగా చంద్రబాబు దిగారని, నక్కలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ ఐదేళ్లలో పలాసలో ప్రశాంతత కరువైందని, సాగు, తాగునీరు లేదని, కొండలను మింగారు తప్ప ఏ ఒక్కరికి న్యాయం చేయలేదన్నారు. ప్రస్తుతం పలాసలో ఉద్యోగాలు లేవని, రైతు బజారు, ఇండోర్ స్టేడియం లేదని, జీడికి మద్దతు ధర లేక రైతులు రోడ్డున పడ్డారని, మరలా టీడీపీ ప్రభుత్వంలోనే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. త్రిమూర్తులుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీలు రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి మద్దతివ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా శిరీషను, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. పలాసలో ఆర్మీ, మాజీ ఆర్మీల కార్పొరేషన్‌ను చంద్రబాబు ఏర్పాటు చేసి సైనికులకు ఆదుకోవడం జరుగుతుందన్నారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పలాసలో భూ కబ్జాలు బాగా పెరిగాయని విమర్శించారు. కొండల రాజు ఇక్కడ తిరుగుతున్నాడని, ఎవరి భూములు మింగేస్తారో, ఏ కొండలు దోచుకుంటారో తెలియదని, అటువంటి వారికి చెక్‌పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన తరువాత వీటిని సరైన చర్యలు చేపడతారన్నారు. ఈ ఐదేళ్లలో పలాసకు మంత్రి ఏం చేశారో చెప్పమని తాను ప్రశ్నిస్తున్నానన్నారు. మా ట్రాక్ రికార్డు ఏంటో ప్రజలకు తెలుసునని, ఆ రికార్డు రేపు బ్యాలెట్‌లో కనబడు తుందన్నారు.





పలాస ప్రజాగళం సభకు తరలివచ్చిన క్యాడర్

క్రమశిక్షణ కలిగిన పార్టీ టీడీపీ

● ఆ పార్టీ పలాస అభ్యర్థి శిరీష



క్రమశిక్షణ కలిగిన పార్టీ టీడీపీ అని, రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రానికి పునర్వైభవం తీసుకు రావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. ఐదున్నరేళ్ల కిందట తితలీ ధాటికి అతలాకుతలమైన పలాసకు అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు వచ్చి 14 రోజులు పలాసలో ఉండి తితలీ బాధను తొలగించేందుకు విశేష కృషి చేశారన్నారు. ఒకప్పుడు పలాసకు తెల్లబంగారంగా పేరుండేది కాని ఇప్పుడు పలాస అంటే భూకబ్జాలు, కొండల దోపిడీగా తయారు చేశారని ఆరోపించారు. ఈ ఐదేళ్లలో పలాసలో ఎటువంటి అభివృద్ధి లేదని, రాష్ట్రంతో పాటు పలాసలో కూడా కనీస అభివృద్ధి కరువైందన్నారు. పలాసకు చంద్రబాబునాయుడు హయాంలోనే ఆఫ్‌షోర్ పథకం మంజూరైందని, పలాస మున్సిపాలిటీతో పాటు నందిగాం, మెళియాపుట్టి మండలాలకు తాగు, సాగునీటికై రూ.464 కోట్లతో ఆఫ్‌షోర్‌ను ప్రారంభించారన్నారు. ఈ ఐదేళ్లలో మంత్రి గాలి కబుర్లు చెప్పారే తప్ప ఏ పనులు చేయలేదని, ఆఫ్‌షోర్‌కు రూ.50 కోట్లు.. రూ.500 కోట్లు అన్నారే గాని ఆ డబ్బులు ఎవరి జేబులకు వెళ్లాయో తెలియదన్నారు. మున్సిపాలిటీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, తాగునీరు పది రోజులకు ఒకసారి ఇస్తున్నారన్నారు. జీడికి మద్దతు ధర కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఐటీ డీఏను పక్క జిల్లాకు వైసీపీ ప్రభుత్వం తరలించిందన్నారు. మరలా టీడీపీ హయాంలో ఐటీడీఏను జిల్లాకు తీసుకు రావాలని కోరారు. కొండలను కరిగించి కట్టించిన కొత్త కిడ్నీ ఆసు పత్రిలో టీడీపీ ఇచ్చిన డయాలసిస్ మిషన్లతోనే చికిత్సలు చేస్తున్నారని, ఉద్దానం కిడ్నీ రిసెర్చ్ కేంద్రాన్ని కచ్చితంగా తీసుకురావా లన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను పలాస, ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేస్తే వలసలు తగ్గుతాయని, మత్స్యకారుల బతుకుల మార్పు కోసం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతిష్టా త్మకంగా చేపట్టిన టిడ్కో, హుద్‌హుద్ ఇళ్లను నిజమైన లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సమావేశంలో టీడీపీ అభ్యర్థులు బగ్గు రమణమూర్తి, మామిడి గోవింద రావు, గొండు శంకర్, పలాస నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, దువ్వాడ హేమబాబు చౌదరి, గురిటి సూర్య నారాయణ, జనసేన నాయకులు దుర్గారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, సూరాడ మోహనరావు, గొరకల వసంతరావు, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో పలువురి చేరిక

పలాస/పలాసరూరల్/మందస/వజ్రపుకొత్తూరు/హరిపురం/టెక్కలి: ప్రజాగళం కార్యక్రమానికి పలాస వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పలువురు వైసీపీ, బీజేపీ ముఖ్య నేతలు టీడీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్, వైసీపీ నాయకుడు దువ్వాడ శ్రీకాంత్, ఆయన సతీమణి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ దువ్వాడ జయశ్రీ, మందస మండలానికి చెందిన బీజేపీ నాయకుడు కొర్ల కన్నారావు, టెక్కలి మండలం వైసీపీ మాజీ అధ్యక్షుడు, అయోధ్యపురం సర్పంచ్ బగాది హరి, సంతబొమ్మాళి మండలం యామాలపేట సర్పంచ్ సంజీవ్ కుమార్ తదితరులకు చంద్రబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తదితరులు పాల్గొన్నారు.



కొర్ల కన్నారావుకు పార్టీ కండువా వేస్తున్న చంద్రబాబు





సర్పంచ్‌లు బగాది హరి, సంజీవ్‌కుమార్‌లకు కండువాలు వేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

వైభవంగా సీతారాముల పెళ్లి రాట

హిరమండలం: హిరమండలం బ్యారేజి సెంటర్‌లో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో బుధవారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి సోమవారం పెళ్లి రాట మహోత్సవం చేపట్టారు. సుభలయ ఆర్‌ఆర్ కాలనీకి చెందిన పతివాడ రమణ దంపతుల ఆధ్వర్యంలో మండపావాహనలు, అష్టదిగ్బలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం హోమం చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం శ్రీరాముని కల్యాణం, పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు శ్రీనివాసశర్మ తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.



పెళ్లిరాట వేస్తున్న భక్తులు

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం

హరిపురం: హరిపురం రైల్వేస్టేషన్ ఆవరణలో సోమవారం శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. లింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామికి పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. మూడురోజులు పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలో జగన్నాథస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అర్చకులు పెంటా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నీలమణిదేవికి పుష్పాలతో అలంకరణ

జలుమూరు (సారవకోట): అవలింగి గ్రామంలో కొలువుదీరిన నీలమణి అమ్మవారిని సోమవారం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి 45వ వసంత త్రిరాత్రి మహోత్సవాల సందర్భంగా విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



వివిధ రకాల పుష్పాలతో అలంకరణ

అండగా నిలవాలి

హిరమండలం: మండలంలోని కిట్టాలపాడు, అంబావిల్లి, పింద్రువాడ, భగీరథపురం తదితర గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సోమవారం పర్యటించి స్థానిక నాయకులు, కార్య కర్తలతో సమావేశమయ్యారు. పార్టీ తనకు అన్యాయం చేసిందని, రానున్న రోజుల్లో తనకు మీరంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, నాయకులు చెట్టు శ్రీను, కె. అప్పలరాజు, కొర్ను సింహాచలం, నాగరాజు, లజపతి పాల్గొన్నారు.

మమ అనిపించారు..

నందిగాం: ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని మండల సర్వసభ్య సమావేశాన్ని మమ అనిపిం చారు. సోమవారం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశం నిర్వహించారు. అయితే ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడంతో సమావేశంలో ఎటువంటి అంశాలపైనా చర్చించేందుకు అవకాశం లేకపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచిస్తూ సమావేశాన్ని ముగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు నామమాత్రంగా హాజరయ్యారు.

గడ్డివాములు దగ్ధం

సంతబొమ్మాళి: మర్రిపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గడ్డివాముల పక్కన విద్యుత్ లైన్ ఉండడంతో షార్ట్ సర్క్యూ ట్ అయి ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. టెక్కలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో పశువుల మేత కోసం ఉంచిన గడ్డివాములు కాలి బూడిదవడంతో బాధిత రైతులు నందికి లక్ష్మీనారాయణ, రాంపాత్రుని అప్పన్న, రాంపాత్రుని సాయి, నందికి సాయి ఆవేదన వ్యక్తంచేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందిగాం: నందిగాం దిగువ బీసీ కాలనీ సమీపంలో కొలువైన సామాలమ్మ అమ్మవారి అలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. మంగళవారం అమ్మవారి గజముద్ద, పగటివేషాలు, నవదుర్గ వేషధారణల మధ్య ఊరేగింపు నిర్వహిస్తున్నా మని, భక్తులు ఘటాలతో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

వైసీపీ ప్రచారానికి వేతనదారులకు సెలవు

నందిగాం: నందిగాం, పెంటూరుల్లో వైసీపీ ఎన్నికల ప్రచారానికి వెళ్లేందుకు గాను ఉపాధి వేతన దారులకు మధ్యాహ్నం సెలవు ప్రకటించారు. పలువురు వేతనదారులు ప్రచారానికి వెళ్లగా మరికొందరు అసహనం వ్యక్తంచేశారు. దీనిపై ఏపీవో ఎం.నాగరాజును ప్రశ్నించగా రెండోపూట పని చేపట్టా లని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించామన్నారు.

'సూపర్‌సిక్స్'పై ప్రచారం

టెక్కలి: అక్కవరం గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉందని, రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థు లను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి కోరారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

జలుమూరు: శ్రీరామ నవమి వేడుకలకు మందిరాలు ముస్తాబయ్యాయి. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే శ్రీరామనవమి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అచ్యుతాపురం, జలుమూరు, తాళ్లవలస, లింగాలవలస, లింగాలపాడు, హరిక్రిష్ణమ్మపేట తదితర గ్రామాల్లోని శ్రీరామ మందిరాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. సామూహిక కుంకుమ పూజలు, అన్నసంతర్పణ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. హరిక్రిష్ణమ్మపేటలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 108 పూర్ణ కలశములతో తిరువీధి, రాత్రి సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గురువారం ఉదయం స్వామి పట్టాభిషేకం వేదపండితులు అక్కాజోష్యుల రమేష్‌శర్మ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని తరించాలని వారు కోరారు.

అంతర్జాతీయ టీ-20లోనూ రాణించాలి

హిరమండలం: హిరమండలం గొట్ట గ్రామానికి చెందిన బత్తుల హరీష్ అండర్-21 విభాగంలో అంతర్జాతీయ టీ20 క్రికెట్ పోటీలకు ఎంపికవడం హర్షనీయమని, ఈ పోటీల్లోనూ రాణించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి ఆకాంక్షించారు. సోమవారం గొట్ట గ్రామంలో హరీష్‌ను అభి నందించారు. మే 10న శ్రీలంకలో జరగనున్న ఇండియా-శ్రీలంక టీ-20 సిరీస్‌లో పాల్గొంటున్న హరీష్ ప్రతిభ కనబరిచి యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చి బాబు, కె.అప్పలరాజు, కొర్ను సింహాచలం పాల్గొన్నారు.



హరీష్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

సుగర్ ఫ్యాక్టరీని మూయించిన తమ్మినేనికి బుద్ధి చెప్పండి

● డీసీసీ అధ్యక్షుడు పేడాడ

ఆమదాలవలస: జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు స్థాపించిన చక్కెర కర్మాగారాన్ని మూసివేయించిన స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఈ ఎన్నికల్లో రైతులు తగిన బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వర రావు అన్నారు. సోమవారం ఆమదాలవలస వన్‌వే జంక్షన్ వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ ఆశయ సాధనే లక్ష్యంగా కార్యకర్తలు, అభిమానులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి నారాయణరావు, కమ్యూనిస్టు నాయకులు బవిరి కృష్ణమూర్తి, బొడ్డేపల్లి మోహన్‌రావు, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పరమేశ్వరరావు

మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

సంతబొమ్మాళి: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా మత్స్యకారుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని టీడీపీ మత్స్యకార నాయకులు సూరాడ ధన రాజ్, సూరాడ భీమారావు, సూరాడ రాయుడు అన్నారు. సోమవారం సంత బొమ్మాళిలో విలేకరులతో మాట్లాడు తూ.. టీడీపీ హయాంలో మత్స్యకారు లకు సబ్సిడీపై వలలు, బోట్లు, రవాణా వాహనాలను, డీజిల్, 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేశారని గుర్తుచేశారు. గతంలో వేట విరామ సమయంలో ఇంట్లో ఎంతమంది మత్స్యకారులుంటే అంతమందికి వేట భృతి ఇచ్చారని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటిలో ఒకరికే భృతి ఇచ్చిందని విమ ర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి మత్స్యకారులు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ మత్స్యకార నేతలు

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి

జి.సిగడాం: ప్రతీ ఓటరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం రెడ్డి రామకృష్ణం నాయుడు అన్నారు. స్వీప్ అవగాహణలో భాగంగా సోమవారం అబోతులపేట గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా స్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం అన్నారు. నీ ఓటే నీ భవిష్యత్ అని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో మానవహారంతో పాటు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ మంగమ్మ, వీవోఏ కుమారి, మహిళా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం మండల పరిధిలో ఉన్న బొబ్బిలిపేట, దూసి, సైలాడ తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్య క్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్రతోపాటు గ్రామ సంఘం ప్రతినిధులు మెట్ట స్వర్ణలత, గరుగుబిల్లి ఈశ్వరమ్మ, రాజు, వీవోఏ శృతి పాల్గొన్నారు.

తొలగించి వదిలేశారు..

● డెబ్రిస్ తరలించకపోవడంతో ఇక్కట్లు
● రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

(నరసన్నపేట)

పాతబస్టాండ్ సమీపంలోని కంబకాయి జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ నెపంతో భవనాలు, దుకాణా లను తొలగించారు. ఈనెల ఒకటిన ఈ పనులకు శ్రీకారం చుట్టి హడావుడి చేశారు. అయితే ఈ ప్రక్రియ జరిగి 15 రోజులవుతున్నా నేటికీ ఆ డెబ్రిస్‌ను తరలించకపోవడంతో దుకాణాలు, ఇళ్ల యజమానులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ అమలు అయి నప్పటికీ పాత పనుల నెపంతో పాతబస్టాండ్ నుంచి జాతీయ రహదారి వరకు కంబకాయి రోడ్డు విస్తరణను రూ.13.5 లక్షలతో ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్డు వేశారు. మిగిలిన ప్రాంతాల్లో తొల గింపు ప్రక్రియ పనులు నిలిచిపోవడం, డెబ్రిస్ రోడ్డుపైనే వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులు గాయాలబారిన పడుతున్నారు. మరొక వైపు మార్కింగ్ ఇచ్చిన మేరకు షాపులు తొలగింపులో కూడా అధికారులు తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డెబ్రిస్‌ను తరలించడంతో పాటు పనులను పూర్తి చేయాలని పలువురు స్థానికులతో పాటు వాహన చోదకులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్ వద్ద ప్రస్తావించగా కంబకాయి జంక్షన్ వద్ద ఒక వైపు తొలగించామని, రెండో వైపు భవనాలు తొలగింపును సంబంధిత యాజమానులు స్వచ్ఛందంగా చేపడు తుండడంతో జాప్యం జరుగుతోంద న్నారు. దీనివల్లే పనులు నిలిచిపోయాయన్నారు.



కంబకాయి జంక్షన్‌లో రోడ్డుపైనే ఉన్న భవనాల శిథిలాలు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ ఎస్.వర హాలు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జమ్ము జంక్షన్, పల్లిపేట, కంబకాయి జంక్షన్‌లో డెమో నిర్వహిం చారు. పెద్ద పెద్ద భవనాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా నిరోధకాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కరప త్రాలను పంపిణీ చేసి అత్యవసర సమయా ల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు. అవగాహన పత్రాలను పంపిణీ చేశారు. ● **ఆమదాలవలస:** అగ్ని ప్రమాదాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి అప్పారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు పురపాలక సంఘంలో అగ్ని ప్రమాద సమ యంలో నివారణా మార్గాలపై ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫ్లై ఓవర్ దిగువున, వైఎస్‌ఆర్ కూడలి వద్ద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ● **సోంపేట:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఫైర్ విన్యాసాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ ఎస్ఎఫ్‌వో ఎస్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్న అధికారులు



సోంపేట: ఫైర్ విన్యాసాలు



ఆమదాలవలస: అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఊకలోడులతో ఇబ్బందులు

జలుమూరు: పరిమితికి మించి ఊక లోడుల రవాణాతో నిత్యం ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తరచూ వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సోమవారం చల్లవానిపేట కూడలిలో ఊకలోడు వాహనం వల్ల చాలా సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. రాత్రి సమయాల్లో ఊక లోడ్లకు అనుమతివ్వాలని పలు గ్రామాల ప్రజలు పోలీసులను కోరుతున్నారు.



చల్లవానిపేట కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

11న జాతీయ లోక్‌అదాలత్

టెక్కలి: స్థానిక కోర్టుల సముదాయంలో మే 11న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి తెలిపారు. సోమవారం కోర్టు సముదా యంలోని బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ కార్యక్ర మం చేపడుతున్నామన్నారు. రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్య క్షుడు డి.వివేకానంద, పలువురు న్యాయ వాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజ చక్రవర్తి

మద్యం మత్తులో యువకుల వీరంగం

● ఒకరికి కత్తి పోట్లు


చికిత్స పొందుతున్న రాము

పొందూరు: మద్యం మత్తులో యువకుల మధ్య చోటుచేసుకున్న వివాదం ఒక యువకుడికి కత్తిపోట్ల వరకు వెళ్లింది. ఎస్‌ఐ వై.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రం పొందూరులోని ఎరుకుల కాలనీకి చెందిన గేదెల రాముకి పొందూరు పట్టణానికి చెందిన సిరిపురపు ఈశ్వరరావు, వాసు, చక్రి మధ్య డబ్బుల విషయంలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో గొడవ జరిగింది. వీరి మధ్య మాటామాటా పెరిగి రాముపై కత్తితో కడుపులో పొడిచారు. దీంతో తీవ్రంగా గాయపడిన రామును కుటుంబసభ్యులు 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గేదెల రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆ ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

షాపులో అగ్ని ప్రమాదం

సోంపేట: పట్టణ మెయిన్‌రోడ్డులో గల ఎస్ఎస్ షాపింగ్‌మాల్‌లోని ఓ షాపులో సోమవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. రంగాల మాధవరావుకు సంబంధించిన షాపులో విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ అగ్నిప్రమాదంలో షాపులో రిపేర్‌కు సిద్ధంగా ఉన్న వస్తువులు కాలిపోయాయి. ఇన్‌చార్జి ఎస్ఎఫ్‌వో ఎస్.మోహనరావు, సిబ్బంది భాస్కరరావు, ఆర్.సింహాచలం, కేవీ రమణ ఆధ్వర్యంలో మంటలను అదుపులోకి తెచ్చారు.

364 మద్యం సీసాల స్వాధీనం


మద్యం సీసాలతో పట్టుబడిన అమర్‌నాథ్

శ్రీకాకుళం క్రైం: గార మండలం చల్లపేట గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి పెరట్లో అక్రమంగా మద్యం సీసాలు నిల్వ ఉంచారన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే చల్లపేట గ్రామానికి చెందిన శిమ్మ జగన్నాథం అనే వ్యక్తి ఇంటి పెరట్లో ఉన్న రేకుల షెడ్‌లో 180 ఎంఎల్ మద్యం సీసాలు 364 ఎక్సైజ్ సీఐ ఎంవీ గోపాలకృష్ణ, అతని బృందం పట్టుకున్నారు. ఈ సీసాలను అదే గ్రామానికి చెందిన బాకీ అమర్‌నాథ్ అనే వ్యక్తి నిల్వ ఉంచడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

750 గ్రాముల కణితి తొలగింపు

● థైరాయిడ్ కేన్సర్‌కు జెమ్స్‌లో వైద్యసేవలు


చికిత్సకు ముందు అన్న.. కణితి తొలగించిన తర్వాత

గుజరాతీపేట: రాగోలు వద్ద గల జెమ్స్ ఆసుపత్రిలో థైరాయిడ్ గ్లాండ్ దగ్గర సుమారు 750 గ్రాముల కణితిని తొలగించినట్టు వైద్యులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం రాయగడలోని గువగణ పరిధి కొలనర గ్రామానికి చెందిన తడింగి అన్న అనే మహిళ కొన్నేళ్లుగా థైరాయిడ్ కేన్సర్‌తో బాధపడుతోంది. ఈ క్రమంలో ఇటీవల జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. సర్జికల్ అంకాలజిస్ట్ సందీప్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి, ఆమెకు బీఎస్‌కేవై పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ క్రమంలో మత్తు వైద్యులు కల్యాణ్ పర్యవేక్షణలో అంకాలజిస్ట్ సందీప్ నాలుగు గంటలపాటు శ్రమించి కణితిని తొలగించారు. ఏళ్ల తరబడి పెరుగుతున్న కణితితో నరకయాతన పడుతున్న తనకు వైద్యులు పునర్జన్మను ప్రసాదించారని ఆమె వైద్యులకు, జెమ్స్ ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. థైరాయిడ్ కేన్సర్ మహిళల్లో ఎక్కువగా వస్తుందని, తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చునని వైద్యులు తెలిపారు.

రిటైర్డు హోంగార్డుకు చెక్కు అందజేత


నూకయ్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: హోంగార్డుగా సేవలందించిన రిటైర్ అయిన ఆరిక నూకయ్యకు తోటి హోంగార్డులంతా స్వచ్ఛందంగా తమ ఒక్క రోజు వేతనాన్ని విరాళంగా అందించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ మొత్తం రూ.4.21 లక్షల చెక్కును నూకయ్యకు ఎస్పీ జీఆర్ రాధిక చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.నర్సింగరావు, హెచ్‌సీ రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలి


సమీక్షిస్తున్న ఏసీ హనుమంతురావు

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమంగా మద్యం తరలించే వారిపై నిఘా పెంచాలని, సీజింగ్ స్థాయిని పెంచాలని అసిస్టెంట్ కమిషనర్ హనుమంతురావు ఆదేశించారు. సెబ్ జేడీ కార్యాలయంలో సోమవారం విజయవాడ సెబ్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ హనుమంతురావు.. ఇంటలిజెన్స్, సెబ్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ స్క్వాడ్, బీఎంటీపీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళ సీజర్ స్థాయిని పెంచాలని, గోదాంల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించాలన్నారు. మద్యం తరలింపు ప్రాంతాలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. రామెటీరియల్ (ఆర్ఎంఎస్) యూనిట్లు తురచుగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. మద్యం అక్రమ నిల్వ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయాలని, బార్లల్లో రికార్డుల కంటే అధికంగా మద్యం ఉంటే ఎక్సైజ్ శాఖతో సమన్వయం అయి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతీ ఒక్క అధికారి నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు.

ఎండ తీవ్రత.. శునకాలు ఇలా..

సరుబుజ్జిలి: ఎండ తీవ్రతకు ప్రజలతోపాటు మూగ జీవాలు కూడా అల్లాడిపోయారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. ఇందుకు ఈ వీధి కుక్కలు సేదతీరుతున్న తీరే అద్దంపడుతుంది. ఎండ తీవ్రతను తట్టుకోలేక స్థానికంగా మూసి ఉన్న ఒక షాపు అలమరాల్లో నాలుగు శునకాలు రైలు బెర్త్‌ల వలే నిద్రపోవడాన్ని చూసిన వారంతా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.


ఓ షాపు వద్ద అలమరల్లో నిద్రపోతున్న శునకాలు

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: ఎన్నికల విధుల్లో పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ.. మాస్టర్ ట్రైనర్లు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని, నియోజకవర్గ స్థాయిలో పీవోలకు శిక్షణ ఇచ్చే సమయంలో వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది ఎంత అవగాహనతో పనిచేస్తే ఎన్నికలు అంత బాగా జరుగుతాయన్నారు. మాక్‌పోల్ నిర్వహణ, ఈవీఎం ఆపరేట్ చేయడం, పీవోల విధులు, బాధ్యతలు, ప్రీపోల్, పోలింగ్ తర్వాత విధులను విడమర్చి చెప్పాలని, నిబంధనలను సంపూర్ణంగా వారికి వివరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ అందజేసిన పీపీటీ-హ్యాండ్ బుక్‌ను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ఈవీఎం మిషన్లలో బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ అనుసంధాన ప్రక్రియ, పోలింగ్ డే రోజు మాక్‌పోల్ ప్రక్రియ, పత్రాలు నింపే విధానం గూర్చి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఈ నెల 20న మరోసారి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు బి.శాంతిశ్రీ, ఎం.కిరణ్‌కుమార్, శేషగిరి, కె.కిరణ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జడ్పీ సీఈవో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి దాదాపు 100 మంది వరకు మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి

కలెక్టరేట్: పోలింగ్ కేంద్రాలకు దివ్యంగులను తరలించడంలో గానీ, కేంద్రాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలింగ్ సందర్భంగా దివ్యాంగులకు చేయాల్సిన ఏర్పాట్లపై ఆర్వోలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో పీడబ్ల్యూడీ ఓటర్లు 21,481 మంది ఉండగా, 85 ఏళ్ల దాటిన వారు 11,845 మంది ఉన్నారన్నారు. అనంతరం హోం ఓటింగ్‌కు సంబంధించి నియోజకవర్గాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతుల ఏడీ కవిత, జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, డీఈవో వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

200 ఏళ్ల నాటి కోదండ రామాలయం

● శ్రీరామ నవమికి ఏర్పాట్లు..


రామకోటి స్థూపం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకా కుళం నగరంలోని పాలకొండ రోడ్డు లో ఉన్న కోదండ రామాలయం సు మారు 200 ఏళ్ల కిందట అల్వారు లు నిర్మించారు. 1826లో అయో ధ్య నుంచి నాటు బళ్లపై సీతారామ విగ్రహాలను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ప్రస్తుతం కోదండ రా మాలయంగా ఉన్న ఈ ప్రదేశంలో అద్దమడుగుల వెంకన్న పంతులు పేదవారికి, అనాథుల కోసం అన్నసత్రం ఏర్పాటు చేశారని, ఆయన ఆధ్వర్యంలోనే కోదండ రామాలయం నిర్మించినట్టు అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు తెలిపారు. సుమా రు 40 ఏళ్లపాటు ఆధ్యాత్మిక వేత్త అరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు స్థానాచా ర్యులుగా ఉండి ఆలయాభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుతం అర్చకులు మరువాడ శ్రీనివాసాచార్యులు స్థానాచార్యుడుగా ఉన్నారు.

ప్రతిష్టాత్మకం రామకోటి స్థూపం

1941లో కోదండ రామాలయంలో కొన్నికోట్ల శ్రీరామనామంతో ఉన్న లిఖితపూర్వకంగా రాసిన రామకోటి పుస్తకాలను నిక్షిప్తం చేయడానికి పెద్ద జీయర్‌స్వామి శ్రీరామస్థూపాన్ని స్థాపించారు. ఇలాంటి స్థూపాలు జిల్లాలో శ్రీకూర్మం, ఆమదాలవలస, కళింగపట్నంలో ఏర్పాటు చేశారు.

నవమికి పసుపు రాట


పసుపురాట వేస్తున్న అర్చకులు, భక్తులు

కోదండ రామాలయంలో సోమవారం ఉదయం అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో పసుపు రాట వేసి శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభించారు. బుధవారం శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణం నిర్వహిం చనున్నట్టు అర్చకులు తెలిపారు. దేవాలయంలో భజనలు, పారాయణాలు, పూజలు ఉంటాయన్నారు.

చార్జిషీట్లు త్వరగా ఫైల్ చేయాలి

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

గుజరాతీపేట: జైల్లో ఉన్న ముద్దాయిల కేసుల్లో చార్జిషీట్లు త్వరిత గతిన ఫైల్ చేయాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ జైలు ముద్దాయి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుల్లో పోలీసులు త్వరగా చార్జిషీట్లు ఫైల్ చేసి, కోర్టుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీదేవి భాస్కరరావు, మహేంద్ర ఫణికుమార్, అడిషనల్ సివిల్ న్యాయాధికారి అనురాధ, యుగంధర్, ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి హిమబిందు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అంకెలపై చిన్నారులకు అవగాహన



ఇచ్ఛాపురం: భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్‌లో చిన్నారుకలు సంసిద్ధత, అంకెలపై అవగాహన కల్పించారు. సోమవారం సెంటర్‌లో చిన్నారులకు 1 నుంచి 10 వరకు అంకెలను వస్తువులను ఫ్లక్ కార్డులతో అంకెలను చూపించి నేర్పించారు.

టీడీపీలోకి 50 వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరిన వారితో అచ్చెన్నాయుడు

టెక్కలి: పెద్దసాన పంచాయతీలోని 50 వైసీపీ కుటుంబాలు సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీహెచ్ వినోద్‌కుమార్, బడగల మౌళి, ఇప్పిలి రాంబాబు, బి.మణి, కె.అభి, వంకాల బలుసాకు, టి.రిక్కీ, సీహెచ్ సాయి, బి.ఆది, జె.శివతో పాటు 50 కుటుంబాల యువత, పెద్దలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే తామంతా వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నామన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా


పెనసాంలో ఎన్ఈఆర్‌కి స్వాగతం పలుకుతున్న దృశ్యం

జి.సిగడాం: అభివృద్ధే ధ్యేయంగా పని చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం నడిమివలస, ఎందువ, గెడ్డకంచరాం, బాతువ, డీఆర్ వలస, పున్నాం, మునినివలస గ్రామాల్లో ఆత్మీయ కలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నాయకులు కుదిరెళ్ల బుజ్జి, కూనుబిల్లి కూర్మారావు, నక్క మురళీ, మునిలినాయుడు, బాలి తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో ప్రచారం


పొందూరు: ప్రచారం నిర్వహిస్తున్న రవికుమార్

పొందూరు: మండల కేంద్రం పొందూరు పట్టణంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పట్టణంలోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అలాగే రవికుమార్ సమక్షంలో పొందూరు మేజరు పంచాయతీకి చెందిన మాజీ ఉప సర్పంచ్, వైసీపీ నాయకులు మలిపెద్ది పార్వతి, మలిపెద్ది శ్రీరంగనాయకులు, మేస్త్రి చిన్న తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కూన సత్యారావు, అన్నెపు రాము, బి.శంకరభాస్కర్, వి.మురళి, బాడానా గిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట


పథకాలపై అవగాహన కల్పిస్తున్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: ఎన్డీఏ అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. సింగుపురం పంచాయతీ బగ్గువానిపేట గ్రామంలో సోమవారం ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొండు జగన్నాథం, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే పాత్రునివలస గ్రామంలో సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గొండు శంకర్ సతీమణి స్వాతి ప్రచారం నిర్వహించారు. నాయకులు గురునాథ్, గుండ శ్యామ్‌సుందర్, బాణ్నాల జయమన్మధ, అప్పారావు, మూకళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో మామిడి గోవిందరావు

పాతపట్నం: హిరమండలం ఎంపీపీ ప్రతినిధి తూలుగు తిరుపతిరావు ఆధ్వర్యంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారికి కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. స్థానికేతర నాయకుల పాలనపై విసుగు చెంది పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. పార్టీలో చేరిన వారిలో వైస్ ఎంపీపీ సవర వైకుంఠరావు, పెద్దగూడ ఎంపీటీసీలు సవర శ్రీదేవి, తట్ల శంకర్, కరణం ప్రియాంక, హిరమండలం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుంకర కోటేశ్వరరావు, సర్పంచ్‌లు మల్లిపురం రామారావు, మండ చిన్నమ్మి, ఉయ్యక సురేష్, కొర్యాయి పెంటయ్య లావేటి లీలావతి, వబ్బంగి లక్ష్మి, కూరంగి మల్లేశ్, పలువురు మాజీ సర్పంచ్‌లు ఉన్నారు. ఇదిలా ఉండగా తామర, తీమర, సీది, పాశిగంగుపేట గ్రామాల్లో మామిడి గోవిందరావు సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎచ్చెర్ల రవీంద్రరావు, కాళ్ల కృష్ణ, కాగితాపల్లి వెంకటరావు, పడ్డాన ఢిల్లీశ్వరరావు, రాడ రామారావు, జనసేన నాయకుడు మిత్తన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు నేతలు టీడీపీలోకి..


టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట): సారవకోట మాజీ ఎంపీటీసీ వాని కామేశ్వరరావుతో పాటు ఆయన అనుచరులు వైసీపీని వీడి సోమవారం టీడీపీలో చేరారు. వీరికి కత్తిరివానిపేట పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, కోన వెంకటేష్, చీడి వెంకటరమణ పాల్గొన్నారు.

పవన్ పేరు వింటే జగన్‌కు జ్వరం

ఆమదాలవలస: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేరు వింటే సైకో సీఎం జగన్‌రెడ్డికి జ్వరం పట్టుకుందామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాత్రుని పాపారావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ విముక్తి ఆంధ్ర ప్రదేశ్ ధ్యేయంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ముందుకు సాగుతుందన్నారు. పవన్ కల్యాణ్‌పై గుంటూరు జిల్లాలో రాయితో దాడి జరిగిన ఘటనను ఆయన ఈ సందర్భంగా ఖండించారు. నేడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి గులకరాయి డ్రామాకు తెరలేపారని విమర్శించారు. ఈయనతోపాటు కోడిపాత్రుని నారాయణరావు, పైడి ప్రసాద్ తదతరులు ఉన్నారు.

జీకే వలసలో టీడీపీ ప్రచారం

ఆమదాలవలస: జీకే వలస గ్రామంలో సోమవారం టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు, మండల టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, టీడీపీ శంఖారావం సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రాళ్లదాడి మరో కోడికత్తి డ్రామా

పొందూరు: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిపై జరిగిన రాయిదాడి మరోకోడి కత్తి డ్రామా అని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికలలో ఓటమి తప్పదని భావించి సానుభూతితో గెలవాలనే ఉద్దేశంతోనే ఈ డ్రామా మొదలుపెట్టారన్నారు. గతంలో కోడికత్తి డ్రామాను చూసిన రాష్ట్ర ప్రజలకు ఇది మరో డ్రామా అని అర్థమైందన్నారు.

కొఠారిలో ఇంటింటా ప్రచారం

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల తగ్గరపడుతున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని వేగ వంతం చేశారు. సోమవారం మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి ఆధ్వర్యంలో కొఠారి గ్రామంలో ఇంటింటా టీడీపీ పథకాలపై అవగాహన కల్పించారు.

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో చదువుతున్న పీజీ విద్యార్థుల మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసినట్టు డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. మొత్తం 18 కోర్సుల్లో 446 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా, 379 మంది ఉత్తీర్ణులైనట్టు చెప్పారు. ఫలితాల వివరాలను జ్ఞానభూమి పోర్టల్, వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. పరీక్ష ఫలితాలపై ఏమైనా సందేహాలు ఉంటే పునః మూల్యాంకనానికి నిర్దేశిత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆదివాసీల హక్కుల రక్షణ కోసమే పోటీ

శ్రీకాకుళం క్రైం: ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసమే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి మూడు ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఎంపీ స్థానంలో ఆదివాసీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్టు ఆదివాసీల సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో ప్రభుత్వాలు మారిన ఆదివాసీల బతుకులు మారలేదన్నారు. గడిచిన ఐదేళ్లలో ఆదివాసీల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం పాటుపడింది లేదన్నారు. రానున్న ఎన్నికల్లో పలాస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులను, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్టు వాబ యోగి వివరించారు. ఏఎస్‌పీ సభ్యులు బాలకృష్ణ, శోభన్, చిన్మయి, గణేష్, అక్కయ్య, ప్రసాద్, ప్రకాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాం

శ్రీకాకుళం క్రైం: రాష్ట్రంలో స్త్రీని ఒక శక్తిగా తీర్చిదిద్దిన ప్రభుత్వం వైసీపీ అని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సోమవారం రూరల్ మండలం గూడేం, చంద్రయ్యపేట గ్రామాల్లో నిర్వహించిన ఆత్మీయ కలయికలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎన్నో అభివృద్ధి పనులు చేశామని రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని తెలిపారు. ఇదే సందర్భంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు.. గూడేం గ్రామానికి చెందిన ఓ మహిళను ఇంకే అభివృద్ధి చేయాలని అడుగగా.. మా ఊరిలో చెరువు పనులు జరగడం లేదని ఎప్పుడు చేయిస్తారంటూ మంత్రిని తిరిగి ప్రశ్నించింది. ఏడాదిగా నాయకులు పనులు చేడంలేదని ఇలా అయితే ఏలా అంటూ మంత్రిని నిలదీశారు. అలాగే నగరంలోని హడ్కోకాలనీలో ఇన్‌చార్జి రామ్మోహన్ ఆధ్వర్యంలో మంత్రి ధర్మాన ఇంటింటా ప్రచారం చేపట్టారు.

నేడు కొఠారి చండీమాత యాత్ర


కొలువైన కొఠారి చండీమాత

కవిటి: రాజపురం పంచాయతీ వింధ్యగిరి గ్రామంలో వెలసియున్న కొఠారి చండీమాత యాత్ర మంగళవారం నిర్వహించనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఏటా చైత్ర శుద్ధ అష్టమి రోజు జరిగే ఈ యాత్రకు ఒడిశా రాజవం శీకులు తొలిపూజ చేసిన తర్వాతనే యాత్ర ప్రారంభం కావటం ఇక్కడ అనవాయితీ. సోమవారం రాత్రి దీపోత్సవ కార్యక్రమాన్ని మహిళలు, భక్తులుచే నిర్వహించారు. ఈ యాత్రకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా ఒడిశా వాసులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

కవిటి: రాజపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశాఖలో గల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కూల్‌లో ప్రవేశానికి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఫిబ్రవరిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కె.అనూష, ఎ.సాయి, బి.వర్షిణి ఎంపికైనట్టు తెలిపారు. సోమవారం విద్యార్థులతో పాటు పీడీ నేతాజీలను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఇండియా కూటమిని గెలిపించాలి

అరసవల్లి: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న బీజేపీని ఓడించి ఇండియా కూటాన్ని గెలిపించాలని శ్రీకాకుళం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి నాగభూషణరావు అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం ఆయన వామపక్ష పార్టీల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ, టీడీపీలు బీజేపీకి భయపడి వారికి కొమ్ము కాస్తున్నాయన్నారు. వామపక్ష నాయకులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, టి.తిరుపతిరావు, మోహనరావు, డీజీఎం బాబు, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఇలా.. తాగునీరు ఎలా?


ముళ్లపొదల్లో ఉన్న చేతి పంపు

సరుబుజ్జిలి: సుబ్బపేట గ్రామంలో స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న చేతిపంపు బోరు ముళ్ల పొదల్లో ఉంది. ఇదే బోరుకు పాఠశాల విద్యార్థులకు కూడా నీటి సదుపాయం కల్పించడానికి అధికారులు మోటారు కూడా ఏర్పాటు చేశారు. అయితే పాఠశాల పక్కనే ఉన్న ఈ చేతి పంపు చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపో వడంతో కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ ముళ్లపొదల మధ్య క్రిమికీటకాలు, విషసర్పాలు చేరి విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ చేతి పంపు చుట్టూ ముళ్ల పొదలు తొలగించి, పరిశుభ్రంగా మార్పు చేయాలని కోరుతున్నారు.

ఇంటి నుంచే ఓటుపై సర్వే చేపట్టండి


మాట్లాడుతున్న ఆర్వో సుదర్శన్ దొర

కంచిలి: సార్వత్రిక ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంటింటా సర్వే జరిపి దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర బీఎల్‌వోలకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న ప్రతీ ఓటురు తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ ఎన్‌వీకేఎస్ రవి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.